
ముళ్లపూడి వెంకటరమణ




# కర్తవ్యం

సుబ్బరాజు వచ్చి కూర్చుని ఏదో చెప్ప బోయేవరకు, రెడ్డిగారతన్ని చేసైగతో వారించి 'ఈ కథ విప్పు' అన్నారు హుందాగా.

రెడ్నాయుడి కొడుకు రావి సెట్టి కూతురుమీద మనసుపడి, మనువాడ తానని ప్రతిజ్ఞపట్టి, తలగట్టుకు పడు కున్నాడు. తండ్రి ఎంత జెప్పినా విన లేదు. గత్యంతరం లేక నాయుడోనాడు సెట్టి భవంతికెళ్లి మెల్లిగా విషయం కదలేశాడు. సెట్టి విరగబడి నవ్వాడు.

"ఒర్ణసంకరమ్మాటటుంచి, అసలు నా అంతస్తేటి, నియ్యంతరవేటి? ఆడేదో కుర్రకుంకడిగాడే అనుకో — నివ్వెట్టా వొచ్చి నన్నడిగావు. ఇదేం జరిగేదనేనా నీ వూహ" ఆవటాని దులిపేశాడు. మాటామాటా వొచ్చింది.

"నీకత నాకు తెల్దా. నువ్వా మినీస్టురి గారి మేనల్లుడికోసం యగబట్టం లేదా? అది నీకు పయ్యంతస్తు గాదా? నేనే మినీస్టురినైతే నివ్విట్టా—మాట తూలే వోడివా. ఇష్టం లేదనక ఇయ్యన్నీ ఎందుకెత్తుతావూ?" అని ఎదురు దిరి గాడు రెడ్నాయుడు.

సెట్టి వగలబడినవ్వి, "నువు మంత్రి వైతే నేరాజు నౌతా దాని కేటిలే" అన్నాడు.

"అవుతా వవుతా వెందుకవ్వా. ఈ ఊరు పంచాయతీగా ఏరిసిననాళ్ళు రాజువి నువుగాకింకెవరూ. అదీ చూద్దా రెన్నాళ్ళో" అన్నాడు నాయుడు ఉ[క్రో]షంగా.

సెట్టిజవాబుకూడా చెప్పలేదు.పద్దులు చూసుకుంటూ కూర్చున్నాడు. రెడ్నాయుడు ఈ పరాభవం తట్టుకోలేక పోయాడు. క్రురతనపౌరుషం కమ్ముకొచ్చేసింది.

లేచి గుమ్మందాకా వెళ్లివెనక్కి తిరిగి "నీకళ్లెదుట నేను మినీష్టరివపోతే ఈ వూరు మునిసిపాల్టీ అయినంతొట్టు" అన్నాడు.

"నా కంటంలో పాణవుండగా అంత పన్జరగ"దన్నాడు సెట్టి.

"చూ దవుతానో కానో" అన్నాడు.

"నీ సంగతి నాకేటి మద్దన. మున్సిపాల్టీమాట జెబుతన్నా, కావలిస్తే ఊరు చుట్టూ కందకం తవ్వించి కోడ గోడలు కట్టేసి పెరక్కుండా చేస్తాగాని దీన్ని మున్సిపాల్టీ జేయనివ్వను." అన్నాడు సెట్టి.

నాయుడు మాట సాంతం వినకుండానే వెళ్లిపోయాడు విశ్వామిత్రుడిలా తానూ ఓ ప్రతిజ్ఞ పట్టాడు. మినిష్టరని పించుకోవాలని.

లోగడ కొన్నాళ్ల రాజకీయాల్లో తిరిగి చెయి గాల్చుకుని, ఒళ్ళు నసిలేక తగ్గిపోయాడు. ఇన్నాళ్ళకు తిరిగి పౌరుషంగా రచ్చకెక్కాడు.

పన్జరగడానికి ముందు పార్టీలో చేరాలి. పార్టీలు మూడున్నాయి గాని ఛాన్సున్నవి రెండే. క.ఖ. అనుకుందాం. రెంటిలోనూ ఎక్కువ ఛాన్సున్నది ఖ అని తేలింది. అందులో పెద్ద తనక్కావలసినవాడుకూడా. లోగడ తనవల్ల ఉపకారం పొందాడు. ఇప్పుడు బాగా పెద్దవాడు.

వెళ్లి మాటాడాడు. కడుపులో ఊహలు ముందరే వెళ్ళబోసుకోడం లౌక్యం, రాజకీయం గాకపోయినా, ఉండబట్టలేక సంగతంతా చెప్పేశాడు.

"దానికేం? చూదాం. కాని ఖర్చు తడిసి మోపెడవుతుంది. పంచాయతీ మునిసిపలు ఎన్నికలున్నాయి ఎదర. ఇపుడు వీటికి కొంత డబ్బెట్టి సాయం చేస్తే ఆకట్టుకోవచ్చు. అది జరిగితేగాని ఆనక మన మొఖం జూసేవాడుండడు మరి" అన్నాడు నాయకుడు,

"సరే" అన్నాడు నాయుడు మర్నాడొచ్చి.

నాయుడేమంత లేనివాడుకాడు. ఇతగానికన్న సెట్టిదొక్క అంతస్తే ఎక్కువ. అతనిమేడకి రెండంతస్తులున్నాయి. ఉన్నంతలో పుట్టించగలిగినంత పోగేసి, కొంత తెగనమ్మి సిద్ధపడ్డాడు నాయుడు యుద్ధానికి. అక్కడినుంచి ఊహూ ఇంటికొచ్చేవాళ్లూ, పోయేవాళ్లూ, ఊళ్లు తిరగడాలూ, మీటింగులూ, ఒత్తడాలూ, తడపడాలూ, పత్రికలూ, రాతలూ, కోతలూ,కూతలూ వెవహారం అంతా మూడోకాలంలో పడింది. గ్రూపులు కలుస్తున్నాయి,

విడుతున్నాయి. నాయుడు ఒక చదువుకున్నాయన్ను కుదుర్చుకుని మంచీ చెడ్డా, శాస్త్రం, పార్టీ, కథా కమామిషూ నేర్చుకున్నాడు. ఆట, పైయాట, పట్టు విడుపూ కుడీ ఎడవా—అన్నీ తన నాయకుడి దగ్గర నేర్చుకున్నాడు. అన్నిటికీ నాయకుడే గురి, ఆయన గీచిన గీటు దాటకుండా నడుచుకున్నాడు. పేరు పేపర్లలో తరచు పడుతూండి।

ఒకసారి ఒక డెలిగేషనులో చేర్పించాడు నాయకుడు — ఓసారెళ్ళిరా నాయుడూ, పొరుగుదేశం వెళ్ళొస్తే ప్రిష్టీజి పెరుగుద్ది అన్నాడు నాయుడు వెళ్ళాడు.

ఆరువారాల తరవాత తిరిగొచ్చేసరికి కథ అడ్డం తిరిగింది. పార్టీలో చీలికలొచ్చాయి. క పార్టీ జనం కొందరు ఖ లో కలిశారు. కొందరు ఎటూగాక మూడోపార్టీలో చేరారు. కొందరు నాలుగోది కట్టుకున్నారు. నాయుడు పార్టీ ఆఫీసుకెళ్ళేసరికి నాయకుడు లేడన్నారు. అతన్ని దుమ్మెత్తిపోశాడు. భ్రష్టుడు దుష్టుడు ద్రోహి వెళ్ళి అందులో కలిశాడన్నారు.

రెడ్నాయుడికి దారి తోచలేదు. తిన్నగా ఇంటికెళ్ళిపోయాడు — ఎవణ్ణి సలహా అడిగితే ఏమవుతుందోనని. అతన్ని ఒక సమస్య పట్టుకుంది. తను ఇన్నాళ్లూవున్న పార్టీలోనే వుండడమా? లేక నాయకుడు కొత్త దాంట్లో చేరాడు గాబట్టి తనూ అందులోకే వెళ్ళడమా? నాయకుడి తెలివితేటలమీద, రాజకీయంలో వుండే ప్రజ్ఞమీద తనకు ఎంతో గౌరవం. ఆయన పద్ధతులు మంచివి. వాటివల్ల దేశానికి మేలుకలుగుతుంది...మరి ఇన్నాళ్లూ ఆయన నడిపిన పార్టీకూడా మంచిదే. ఆయన పద్ధతులే గదా అదీ అనుసరించింది? తనేం చెయ్యాలి? ఎవరితో కలవాలి? ఇదీ చిక్కు!

* * *

“సుబ్బరాజూ, నువ్వు గట్టివాడవైతే ఈ చిక్కు విప్పాలి. నువ్వే నాయుడివైతే ఏం జేస్తావు? చెప్పు” అన్నారు రెడ్డిగారు కథ ఆపి.

“పార్టీ లక్ష్యాలు, దేశం మేలుకన్న మినిస్టరవడం ముఖ్యం. పార్టీ ఏదైనా చేస్తాననేదాకటే. ఎవరుచేసినా మానినా, జరిగేదెలాగూ జరుగుతుంది. దేశంలో పన్లూ పార్టీ పాలసీలనుబట్టి కాదు; మనుషుల పాలసీలనుబట్టి జరుగుతాయెప్పుడూ. అందువల్ల నాయుడు ఇలాగే ఆలోచించివుంటాడు. ఇకపోతే, శరీరంలో తలను ఉత్తమాంగం అన్నారు. పార్టీలకీ అంతే. నాయకుడు ముఖ్యం గాబట్టి రెడ్డినాయుడు పార్టీల వెంటగాక, తనకి ఆసరావుండి ఆదుకుంటున్న నాయకుడితోనే కలిసి వుంటాడు. అతనేపార్టీ అయితే తనూ ఆ పార్టీయే కావాలి. అదే లాభసాటి. అదే జరగాల్సింది. అదే జరుగుతున్నది.” అన్నాడు సుబ్బారాజు.

రెడ్డిగారు చుట్టపారేసి తలతాటించి వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు.